20న ఘంటసాల జయంతి

చిక్కడపల్లి: ఈ నెల 20 న త్యాగరాయ గానసభలో ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ రాగరాగిణి ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షులు ఎంవీ.రమణకుమారి, ప్రధాన కార్యదర్శులు ఎంవీ సుబ్బలక్ష్మి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం అవుతుందని ప్రముఖ గాయకుడు వి.ప్రభాకర్‌రావుకు ఆత్మీయ సత్కారం ఉంటుందన్నారు.

గవర్నర్‌కు వినతి


గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

ముషీరాబాద్: గ్రామీణ ప్రాంతాలు, మురికి వాడలు, ఏజెన్సీ ప్రాంతాలు, తండాల్లో సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ ప్రాక్టీషనర్లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్, పోలీసు డిపార్ట్‌మెంట్, డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ వారు మోపిన కేసులు ఎత్తేసి, అక్రమ అరెస్టులు, దాడులను నిలిపి వేయాలని శనివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నేతి రాజేశ్వర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజు ఇతర సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయం అందజేసిన ముఠా జైసింహ

చిక్కడపల్లి: మహబూబాబాద్ జిల్లాకు చెందిన గిద్దె విష్ణు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయాడు. నగరంలో ఓ హాస్టల్‌లో ఉంటూ కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్నాడు. హాస్టల్ ఫీజు కోసం ఇబ్బందులు తలెత్తడంతో శనివారం ముఠా జయసింహను కలువగా ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయం అందిస్తానని ముఠా జయసింహ పేర్కొన్నారు.

మంత్రివర్గంలో ముస్లింలకు చోటు కల్పించాలి


మాట్లాడుతున్న మహమ్మద్ ముస్తాక్ మాలిక్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో ముస్లిం మంత్రి లేకపోవడం బాధాకరమని తహ్రీక్ ముస్లిం షబ్బాన్ అధ్యక్షుడు మహమ్మద్ ముస్తాక్ మాలిక్ అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అత్యధికంగా ముస్లిం సమాజం మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 14 శాతం ఉన్న మైనార్టీలకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం ఇది తొలిసారి అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మత ఘర్షణలు ఎక్కువ అవుతున్నాయని దీనిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 1953 తర్వాత తొలిసారిగా తెలంగాణ మంత్రివర్గంలో ముస్లిం ప్రతినిధి లేడని, అలాగే కాంగ్రెస్ పార్టీ నుంచి ముస్లిం ఎమ్మెల్యే ఎవరూ ఎన్నిక కాలేదని వెల్లడించారు. ప్రభుత్వం స్పందించి మంత్రివర్గంలో మైనార్టీలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అక్బర్ అఖ్తర్ అలీ, గఫార్, ఖాలీద్ ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు మార్కెట్‌కు అనుగుణంగా లభించే అవకాశాలను అందిపుచ్చుకుని తమ జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలని అంబేడ్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియా అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీల నుంచి విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 60 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆదరణ కలిగిన కార్పొరేట్ సంస్థల నుంచి కూడా అవకాశాలు లభిస్తున్నాయన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుండాలి


సర్వే సాయితేజను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కవాడిగూడ: ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఇటీవల యూత్ కాంగ్రెస్‌లో జరిగిన ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శిగా సర్వే సాయితేజ్ ఎన్నికైన సందర్భంగా శనివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని జేబీ అపార్టుమెంట్ వద్ద ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి అరవింద్‌కుమార్ హాజరై సర్వే సాయితేజను సన్మానించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... కష్టపడి పనిచేసే ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముషీరాబాద్ నియోజకవర్గంలో ఇంటింటికి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ప్రసాద్, శాంతికుమార్, భిక్షపతి, విదూర్‌చావ్లా, భాగ్యరాజ్, కనకరాజ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దత్త జయంతి


ఉత్సవ మూర్తికి పూజలు చేస్తున్న దృశ్యం


డీడీ కాలనీలో దత్తాతేయ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే, కార్పొరేటర్



నల్లకుంట: శ్రీదత్త జయంతిని పురస్కరించుకుని శనివారం అంబర్‌పేట నియోజకవర్గంలోని షిరిడీ సాయిబాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. బాగ్ అంబర్‌పేటలోని సాయిబాబా మందిరంలో శ్రీగురు దత్తాత్రేయ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో మహోత్సవం ప్రారంభమైంది ముందుగా బాబాకు కాకడ హారతిచ్చి 6.30 గంటలకు దివ్యమంగళ స్నానం చేయించారు. అనంతరం గురుస్తోత్రం, హనుమాన్ చాలీసా, భజన చేశారు. ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సాయిబాబా సంస్థాన్ పారాయణ బృందంచే శ్రీ గురు చరిత్ర సంపూర్ణ పారాయణ చేశారు. సాయంత్రం అర్చక స్వాముల మంత్రోచ్చారణల నడుమ శ్రీ సత్య దత్త వ్రతం నిర్వహించారు. అనంతరం పల్లకీ, ఊయల సేవ, రాత్రి 9.30 కు శేజ్ హారతితో మహోత్సవాలు ముగిశాయి.

◆ ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ సమీపంలోని దత్త పీఠం వద్ద శ్రీ గురు దత్త జయంతిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక స్వామి ప్రసాద్ మంత్రోచ్చారణల నడుమ దత్తాత్రేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దత్తాత్రేయ స్వామి కేలండర్‌ను ఆవిష్కరించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు సీహెచ్. సాయిమోహన్, కె. గోవర్ధన్ రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి: డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని బాపూనగర్‌లో నిర్వహించిన 'ప్రజల వద్దకే కార్పొరేటర్' కార్యక్రమంలో ఆమె బస్తీలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ప్రధానంగా బస్తీలో నెలకొన్న లోప్రెజర్, కలుషిత నీటి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. కార్పొరేటర్ వెంట వినయ్‌కుమార్, దామోదర్, శ్రీను, హరీష్, నాగరాజు, శోభ, వసంత కోటీశ్వరి, జయలక్ష్మి, రేణుక ఉన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

ఆలోచనలే విజయానికి సోపానాలు


సదస్సులో మాట్లాడుతున్న అనుపమ రాజన్

కాచిగూడ: ప్రతి వ్యక్తి జీవితంలో రిస్క్ తీసుకుంటేనే విజయాలు సాధించి, ఉన్నత స్థానాల్లో నిలుస్తారని ప్యాక్‌సెట్ వైస్‌ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) అనుపమ రాజన్ అన్నారు. తెలంగాణ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎక్స్‌ఎల్‌ఆర్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సౌజన్యంతో శనివారం బర్కత్‌పుర లోని రాజాబహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన 'హెచ్‌ఆర్ అండ్ టీపీఓ కాన్‌క్లేవ్-సమవేత్తై' సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రిస్క్ తీసుకునే వ్యక్తిగా ఉండటంతో ప్రపంచం మన మెదడుకు ఆహారాన్ని ఇస్తుందన్నారు. మనం చిన్న చూపు చూసుకోకుండా స్వేచ్ఛగా కమ్యూనికేట్ చేసే ధైర్యం కలుగుతుందని ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. తమకున్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఎదురయ్యే అవరోధాలను అధిగమించి విజయాలు సాధించేందుకు సిద్ధం కావాలన్నా రు. ఈ సందర్భంగా తెలంగాణ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ లీడర్స్ అసోసియేషన్ 'ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్'పై ఎక్స్‌ఎల్‌ఆర్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కంపెనీతో ఎంఓయు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ డిగ్రీ, పీజీ కాలేజీల టీపీవోస్, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్‌తో పాటు ఎక్స్‌ఎల్‌ఆర్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ అమిత్ సహా, మేనేజర్ రవిచంద్ర, అసోసియేషన్ అధ్యక్షుడు అలీముద్దీన్, ఉపాధ్యక్షురాలు వేదాంతం సంయుక్త, ఫాతిమా, చైతన్య భారతి పాల్గొన్నారు.

డీటీయూ అభ్యర్థులను గెలిపించుకుందాం


మాట్లాడుతున్న లింగమల్లు యాదవ్

కాచిగూడ: మార్చిలో రెండు స్థానాల్లో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధర్మా టీచర్స్ యూనియన్ (డీటీయూ) అభ్యర్థులను గెలిపిస్తే తెలంగాణ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపడతామని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాక లింగమల్లు యాదవ్, దామెర ఉపేందర్ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధర్మా టీచర్స్ యూనియన్‌కు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం రామరాజు (ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్), రిటైర్డ్ ఎంఈఓ దామెర బాబురావు (నల్గొండ, వరంగల్, ఖమ్మం)లను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన అన్ని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అగ్ర కులాలల వారే గెలిచి విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను విస్మరించారని ఇప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో పి.అశోక్, ఎన్.రమేష్, బి.సుధాకర్, కె.రాజు, డాక్టర్ కొండా ఆశన్న, పి.జనార్ధన్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

ముషీరాబాద్: మున్సిపాల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో సూర్యం పాల్గొని మాట్లాడారు. 11వ పీఆర్‌సీ ప్రకారం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు పెంచినప్పటికి కొన్ని మున్సిపాలిటీలలో నేటికి అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో మేడే కానుకగా రూ. వెయ్యి ప్రకటించినా కొన్ని చోట్ల ఇవ్వడం లేదన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. జనవరి 5న తొర్రూర్ పట్టణంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బి.మల్లేష్, కె.గంగమ్మ, ఎస్.మరియమ్మ, వేముల గురునాథం, ఎంకన్న, ఎం.రామస్వామి పాల్గొన్నారు.

28 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చండి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర జాబితాలో లేని 28 కులాలను కేంద్ర జాబితాలో చేర్చాలని ఓబీసీ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ వెన్న ఈశ్వరప్ప కోరారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఓబీసీ సాధన సమితి అడ్‌హక్ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ తిపిరిశెట్టి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈశ్వరప్ప పాల్గొని మాట్లాడుతూ... గత కొన్ని ఏళ్లుగా కేంద్ర ఓబీసీ సర్టిఫికెట్లు లేక రాష్ట్రంలో 28 కులాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జాతీయ బీసీ కమిషన్ విచారణ చేసి నివేదిక కేంద్ర ప్రభుత్వానికి పంపించినా కూడా జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నేడు ఎల్లా వెంకటేశ్వర్‌రావుకు సత్కారం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రపంచ ప్రఖ్యాత మృదంగ విద్వాంసుడు ఎల్లా వెంకటేశ్వర్‌రావు 75 ఏళ్ల సంగీత రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వారి శిష్య బృందంచే ఈ నెల 15న రవీంద్రభారతిలో అమృతోత్సవ సంబరాల పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరిస్తున్నట్లు వాయిద్య కళాకారుల జాతీయ అధ్యక్షులు ఎల్‌వీ చెన్నారావు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో కలిసి సత్కారించారు. ఈ సందర్భంగా చెన్నారావు మాట్లాడుతూ.. ఎల్లా వెంకటేశ్వర్‌రావు సన్మాన సభకు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, ప్రపంచ ప్రఖ్యాత సంగీత విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయకుడు, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం హాజరవుతారన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. గోల్నాక డివిజన్ లంక బస్తీలో రూ.29 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆయన కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు

పరామర్శ

ముషీరాబాద్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌ను శనివారం భోలక్‌పూర్‌లోని ఆయన నివాసంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కలిసి పరామర్శించారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

కాచిగూడ: రైలుకింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప వివరాల ప్రకారం... వారాసిగూడలోని పుట్టింట్లో ఉన్న భార్య లలిత వద్దకు ఉప్పుగూడకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కె.శ్రీనివాస్ (53) శుక్రవారం రాత్రి కూతురు జాగృతితో కలిసి బయలుదేరాడు. ఉప్పుగూడ స్టేషన్‌లో ఎంఎంటీఎస్‌లో కూతురుని ఎక్కించి తాను ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు రైలుకింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వాహనం తగిలి విరిగిన స్తంభం


విరిగిన స్తంభాన్ని పరిశీలిస్తున్న గౌసుద్దీన్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ గుల్షన్ నగర్‌లోని ఐటీఐ వీధిలో ఓ వాహనం విద్యుత్ స్తంభానికి తగలడంతో విరిగిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వెంటనే సరఫరా నిలిపివేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గౌసుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని విరిగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయించారు.

జీఓ-317 సవరించాలి


మాట్లాడుతున్న నారాయణ

కవాడిగూడ: జీఓ-317ను సవరించి ఆ జీఓతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, జీఓ-317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జేఏసీ చైర్మన్ విజయ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఓ-317 బాధితులకు సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా గాంధీభవన్ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థికభారం లేని పరిష్కరించగలిగే సమస్య అయినా జీఓ- 317ను సవరించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో మంత్రివర్గ ఉప సంఘం కమిటీ నియమించినప్పటికీ ఆ కమిటీ ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వకుండా తమకు అన్యాయం చేసిందని ఆరోపించారు. మంత్రివర్గ ఉపసంఘం కేవలం 3జీఓలను విడుదల చేసి స్పౌజ్, మ్యూచ్యువల్, మెడికల్ బాధితులకు మాత్రమే ఊరట కలిగించేలా ఉన్నాయన్నారు. వాస్తవంగా మంత్రివర్గ ఉపసంఘం 317 జీఓతో స్థానికత కోల్పోయిన బాధితులకు న్యాయం చేసేందుకు ఏర్పాటయ్యింది కానీ.. స్థానికత అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా మంత్రివర్గ ఉపసంఘం 3 జీఓలను విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ధర్నాలో జేఏసీ సెక్రెటరీ సందీప్, కోశాధికారి వినోదా, నేతలు వెంకటేష్, ప్రవీణ్, పోచన్న, కృష్ణప్రసాద్, భరత్‌ద్వాజ్, ఎండీ సమియుద్దీన్, బాలప్రసాద్ పాల్గొన్నారు.


హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ హాస్టళ్లలో వసతులను మెరుగుపర్చాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రభుత్వ హాస్టళ్లలో వసతులకు మెరుగుపర్చాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో కామన్ డైట్ మెనూను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలయ్యారని అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు వంటకాలను పరిశీలిస్తు ఉండాలన్నారు. హాస్టల్‌లో పిల్లలకు అల్పాహారంతో పాటు మంచి భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. హాస్టల్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులు తమకు సకాలంలో వేతనాలు అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్‌ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, యువజన కమిటీ అధ్యక్షుడు సాయి, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, సీనియర్ నాయకులు రహీం పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన కాంగ్రెస్'


మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్‌గౌడ్

ముషీరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ విమర్శించారు. శనివారం ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి డబ్బులిచ్చి పదవిని కాపాడుకుంటున్నాడని.. అందుకే ప్రజల సొమ్మును దోచుకుంటూన్నాడని ఆరోపించారు. పేదల నమ్మకాన్ని వమ్ము చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి కాంగ్రెస్‌కు పట్టం కడితే ఆ పార్టీ నేతలు సైతం ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ప్రజల కోసం పని చేసే పార్టీ బీజేపీ అని రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీ, నాయకులు రాజు, నవీన్‌గౌడ్, బిజ్జి కనకేష్, సదానంద్, నందు, విశ్వం, నందగిరి నర్సింహ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఇన్‌స్పెక్టర్


ఉప్పల్ చౌరస్తాలో సపర్యలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి

ఉప్పల్: ఆకలితో అలమిటిస్తూ స్పృహ కోల్పోయిన ఓ వృద్ధురాలికి సాయం చేసి ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి మానవత్వం చాటారు. ఉప్పల్ సికింద్రాబాద్ బస్‌స్టాప్ వద్ద ఫుట్‌పాత్‌పై కాశవ్వ సాయం కోసం ఎదురు చూస్తూ.. తన బాధను ఎవరికీ చెప్పుకోలేక రోడ్డుపైనే పడిపోయింది. గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో సమాచారం అందుకున్న ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలికి సపర్యలు చేసి నీరు తాగించి కూర్చోబెట్టారు. ఆకలితో అలమటిస్తున్న ఆమెకు అన్నం పెట్టించి సైదాబాద్‌లో ఉంటున్న కుమారుడికి సమాచారం ఇచ్చి తల్లిని అప్పగించారు. బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పిన ఆమె స్పృహ తప్పి పడిపోయిందని ఇన్‌స్పెక్టర్ వివరించారు.